క్లుప్తంగా

రోడ్లపై 'కేజ్‌వీల్స్' తిప్పితే కేసులు



డొంకేశ్వర్(ఆర్మూర్): గ్రామాల్లోని బీటీ రోడ్లపై కేజ్‌వీల్స్ ట్రాక్టర్లు తిప్పితే చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తామని పోలీసులు హెచ్చరించారు. మండలంలోని తొండాకూర్, దత్తాపూర్ గ్రామాల్లో పోలీసు శాఖ ఆధ్వర్యంలో శనివారం ప్రచారం నిర్వహించారు. కేజ్‌వీల్స్‌తో ఎవరైనా రోడ్డెక్కితే వాహనాన్ని సీజ్ చేయడంతో పాటు యజమానిపై కేసు నమోదు చేస్తామని ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

నందిపేట్: రోడ్లపై కేజ్‌వీల్ ట్రాక్టర్లు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ శ్రీకాంత్ హెచ్చరించారు. మండలంలోని శాపూర్‌లో ఆయన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రజలకు పలు సూచనలు అందించారు.

బీఆర్‌ఎస్‌కు మద్దతు తెలుపుతూ తీర్మానం



నందిపేట్(ఆర్మూర్): మండల కేంద్రంలోని ఒడ్డెర సంఘం సభ్యులు తమ పూర్తి మద్దతు బీఆర్‌ఎస్‌కే తెలుపుతూ ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈమేరకు శనివారం మండల పార్టీ అధ్యక్షుడు మచ్చర్ల సాగర్‌కు వారు తీర్మాన ప్రతిని అందజేశారు. అనంతరం ఒడ్డెర సంఘ సభ్యులకు పార్టీ కండువా కప్పి స్వాగతం పలికారు. జెడ్పీటీసీ ఎర్రం యమున ముత్యం,నాయకులు ఉల్లి శ్రీనివాస్‌గౌడ్, భాస్కర్, వార్డు సభ్యులు మాన్పూర్ భూమేష్, అశోక్, రాజశేఖర్, శ్రీను, స్వామి, రవి, శేఖర్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

పావలా వడ్డీ రుణాల పంపిణీ



మాక్లూర్: మహిళా సంఘాలకు మంజూరైన పావలా వడ్డీ రుణాలను శనివారం కల్లెడి గ్రామంలో మహిళలకు వైస్ ఎంపీపీ సుక్కి సుజాత సుధాకర్ అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మనీష్‌గౌడ్, మహిళ సంఘం వీవోఏలు పాల్గొన్నారు.

గోసంగిలకు దళితబంధు ఇవ్వాలి

రుద్రూర్: గోసంగిలకు 'దళిత బంధు' ఇవ్వాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు శనివారం పార్టీ ఆధ్వర్యంలో బుడగ జంగాలు మోస్రా తహసీల్దార్ సాయిలుకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. రెండో విడత దళితబంధు పంపిణీలోనైనా గోసంగిలను లబ్ధిదారులుగా ఎంపిక చేయాలని కోరారు. లేదంటే పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. నాయకులు నన్నేసాబ్, మిరియాల వీరప్ప, చిత్తారి లాలు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



బోధన్: నేరాల నియంత్రణకు క్షేత్రస్థాయిలో విధులు నిర్వర్తించే అధికారులకు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని బోధన్ కోర్టు అసిస్టెంట్, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ చిదిరాల రాణి, డాక్టర్ సమ్మయ్యలు సూచించారు. పట్టణంలోని కోర్టులో శనివారం ఎక్సైజ్, ఫారెస్ట్‌శాఖ అధికారులకు చట్టాలపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడారు. ఎక్సైజ్, ఫారెస్ట్ శాఖల ఎస్సైలు బాలయ్య, ప్రభాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని బడులపై చర్యలు తీసుకోవాలి



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలంలో ప్రభుత్వ నిబంధనలను పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ నవ నిర్మాణ్ విద్యార్థి సేన నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు శనివారం ఎంఈవో రాజ గంగారాంకు వినతిపత్రం అందజేశారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్న, పుస్తకాలు విక్రయిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలన్నారు. నాయకులు మురళి, తేజ, తిరుపతి పాల్గొన్నారు.

అందుబాటులో సోయా విత్తనాలు

రుద్రూర్: రుద్రూర్ వ్యవసాయ పరిశోధన కేంద్రంలో సోయా చిక్కుడు బాసర రకం విత్తనాలు అందుబాటులో ఉన్నట్టు పరిశోధన కేంద్రం అధిపతి బాలాజీనాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆలస్యంగా వర్షాలు కురుస్తున్నందున సోయా చిక్కుడు రకాలైన జెఎస్-335, జెఎస్- 9305, బాసర విత్తనాలను ఈ నెల మొదటి పక్షం వరకు విత్తుకోవచ్చునని ఆయన సూచించారు. సోయాచిక్కుడు బాసర రకం విత్తనం కావాల్సిన రైతులు సెల్ నంబర్‌లు 99896 25218, 89853 31641 సంప్రదించాలని కోరారు.

పల్లె చెంతకు వైద్య సేవలు

- డొంకేశ్వర్ మండలంలో హెల్త్ అండ్ వెల్‌నెస్ కేంద్రాలు
- దత్తాపూర్, మారంపల్లి, గాదేపల్లి గ్రామాల్లో ఏర్పాటు



దత్తాపూర్ హెల్త్ అండ్ వెల్‌నెస్ కేంద్రంలో గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది



వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

డొంకేశ్వర్(ఆర్మూర్): పల్లె ప్రజలకు ప్రభుత్వ వైద్య, ఆరోగ్య సేవలు మరింత చేరువ చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాయి. ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో హెల్త్ అండ్ వెల్‌నెస్ కేంద్రాలను ఆరు నెలల క్రితం ఏర్పాటు చేసింది. ఇందుకు డొంకేశ్వర్ మండలంలో ఐదు వేల జనాభాకు ఒకటి చొప్పున మూడు కేంద్రాలు మంజూరయ్యాయి. దత్తాపూర్, మారంపల్లి, గాదేపల్లి గ్రామాల్లో ఇటీవల వైద్యశాఖ అధికారులు ఆయా కేంద్రాలను ప్రారంభించారు. కేంద్రానికి ఒకరు చొప్పున ప్రత్యేకంగా మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ (ఎంఎల్‌హెచ్‌పీ)ను కూడా ప్రభుత్వం నియమించింది. ఎంఎల్‌హెచ్‌పీకి తోడుగా ఇద్దరు ఏఎన్ఎంలు, ఆశాలు పని చేస్తారు.

అయితే, హెల్త్ అండ్ వెల్‌వెస్ కేంద్రాలకు ప్రత్యేక భవనాలేవీ లేకపోవడంతో స్థానికంగా ఉన్న సబ్ సెంటర్లలోనే కొనసాగిస్తున్నారు.

ఆరోగ్యం, యోగాపై అవగాహనే ముఖ్య ఉద్దేశం

దత్తాపూర్ సెంటర్ పరిధిలో శాపూర్, తొండాకూర్ గ్రామాలు, మారంపల్లి సెంటర్ పరిధిలో గంగాసముందర్, అలాగే గాదేపల్లి సెంటర్ పరిధిలో అన్నారం, సిస్సూర్, చిన్నయానం, జీజీ నడ్కుడ గ్రామాలను చేర్చారు. ఈ సెంటర్ల పరిధిలోని గ్రామాల ప్రజలకు వైద్య సేవలతో పాటు ఆరోగ్య సలహాలు, యోగా శిక్షణ, ప్రభుత్వాస్పత్రుల్లో డెలివరీలపై అవగాహన కల్పించడమే కార్యక్రమ ముఖ్య ఉద్దేశం. అయితే, ఎవరైన అనారోగ్యానికి గురైతే వైద్యులు అక్కడే పరీక్షించి మందులు పంపిణీ చేస్తున్నారు. షుగర్, బీపీ, ఇతర దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి నెలవారీగా మందులను ఇక్కడే అందజేస్తున్నారు. మారంపల్లి కేంద్రానికి ఎంఎల్‌హెచ్‌పీ పోస్టు ఖాళీగా ఉండడంతో భర్తీ చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. పల్లె దవాఖానాల మాదిగా ఏర్పాటైన హెల్త్ అండ్ వెల్‌నెస్ కేంద్రాల్లో అందిస్తున్న వైద్య సేవలపై చుట్టు పక్కల గ్రామాల ప్రజలకు తెలిసేలా మరింత విస్తృత ప్రచారం నిర్వహించాల్సి అవసరం ఉంది.

ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి



మండలంలో ఏర్పాటైన మూడు హెల్త్ అండ్ వెల్‌నెస్ కేంద్రాల ద్వారా పల్లె ప్రజలకు లోపాల్లేని వైద్య సేవలను అందించడానికి కృషి చేస్తున్నాం. మహిళలు, వృద్ధులకు యోగా శిక్షణ, దీర్ఘకాలిక వ్యాధులకు ఉచితంగా మందులను అందిస్తున్నాం. ప్రభుత్వాలు కల్పించిన ఈ సౌకర్యాలను గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

– సుచరిత, మెడికల్ ఆఫీసర్, డొంకేశ్వర్

ఘనంగా జాతీయ వైద్యుల దినోత్సవం

నందిపేట్/బోధన్/ఎడపల్లి/బాల్కొండ/ఆర్మూర్ టౌన్: ఆర్మూర్, బాల్కొండ, బోధన నియోజకవర్గాల్లో శనివారం జాతీయ వైద్యుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా నందిపేట, బోధన్, ఎడపల్లి, ఆర్మూర్, బాల్కొండ మండలాల్లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వైద్యులకు సన్మానం చేశారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యులు మాట్లాడుతూ.. వైద్యుల సేవలను కొనియాడారు. ఎడపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు పలకలను అందజేశారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు తినుబండారాలను పంపిణీ చేశారు. చార్టెడ్ అకౌంటెంట్ డే సందర్భంగా ఆర్మూర్‌లో పలువురు చార్టెడ్ అకౌంటెంట్లను సన్మానించారు. అలాగే రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్స్ డే, చార్టెడ్ అకౌంటెంట్ డే నిర్వహించి ఆయా రంగాలకు చెందిన వారిని సన్మానించారు.





నందిపేటలో డాక్టర్లను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు.. బోధన్ పట్టణంలో..



బాల్కొండ మండల కేంద్రంలో..



ఆర్మూర్ పట్టణంలో..



ఎడపల్లి మండలంలో..

'బంధువుల క్వారీ అని మంత్రే ప్రకటించాడు'



ముప్కాల్‌లో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

బాల్కొండ: బట్టాపూర్ కంకర క్వారీ తన బంధువుదని మంత్రి ప్రశాంత్‌రెడ్డి గతంలో బహిరంగంగా ప్రకటించారని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు నిమ్మల శ్రీనివాస్ అన్నారు. ముప్కాల్ మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. క్వారీపై బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మల్లికార్జున్‌రెడ్డి నిరాధర ఆరోపణలు చేశాడంటు తప్పుడు మాటలు మాట్లాడవద్దన్నారు. తమ నాయకుడు అన్ని ఆధారలతోనే మాట్లాడారన్నారు. అన్నపూర్ణమ్మ, మహిపాల్ రెడ్డిల గురించి మాట్లాడే నైతిక హక్కు బీఆర్‌ఎస్ నాయకులకు లేదన్నారు. కేవలం కంకర క్వారీ కోసం నియోజకవర్గంలో రోడ్లు వేస్తున్నారన్నారు. డబుల్ బెడ్‌రూం నిర్మాణాలు నియోజకవర్గంలో ఎందుకు వేగంగా సాగడం లేదని ప్రశ్నించారు. మాజీ సహకార సంఘం చైర్మన్ గడ్డం సంతోష్ కుమారుడిపై గంజాయి తప్పుడు కేసు పెట్టించింది మంత్రి కాదా! అని ప్రశ్నించారు. చిల్లర మాటలు మాట్లాడితే సరైన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. నాయకుల ముస్కు నర్సయ్య, సంతోష్, కే.ఎం రెడ్డి, రఘు,మజీత్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ అభివృద్ధిపై నిర్లక్ష్యం



బోధన్: విద్యారంగం అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి మాదం తిరుపతి అన్నారు. పట్టణంలోని పీఆర్టీయూ భవన్‌లో శనివారం నిర్వహించిన ఉమ్మడి జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా బోధన్‌కు చెందిన విద్యార్థి నాయకుడు తలారి సంజయ్, 50 మంది విద్యార్థులతో కలిసి యూఎస్ఎఫ్ఐలో చేరారు. వారికి సభ్యత్వం రశీదులు అందించి ఆహ్వానించారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ.. జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ యూనివర్సిటీలో సమస్యలు పరిష్కరించాలన్నారు. నాయకులు రాజేష్ నాయక్, అరుణ్, కిరణ్, మహేష్ పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ఇంటింటి ప్రచారం





పడగల్‌లో కేంద్ర పథకాలపై ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు.. కుర్నాపల్లి గ్రామంలో..

వేల్పూర్: మండలంలోని పడగల్, మోతె, అంక్సాపూర్, పోచంపల్లి, మోతె గ్రామాలలో మండల బీజేపీ నాయకులు శనివారం మేరా బూత్ సబ్‌సే మజ్బూత్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. నాయకులు మల్కన్నగారి మోహన్, ఏలేటి రమేశ్, భాను, రమేశ్, మల్లారెడ్డి, గంగారెడ్డి, రమేశ్, సురేష్, నాగరాజు, రాగి ప్రభాకర్, లింగారెడ్డి పాల్గొన్నారు.

ఎడపల్లి మండలంలో..

ఎడపల్లి(బోధన్): మండలంలోని కుర్నాపల్లి గ్రామంలో శనివారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డి మోహన్ రెడ్డి, పార్టీ నాయకులు కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. నాయకులు శ్రీధర్, కమలాకర్ రెడ్డి, సర్పంచులు సాయిలు, ఇంద్రకరణ్, రాజాలక్ష్మీ హనుమంతు, నర్సింహులు, వెంకటేష్, పవన్, రంజిత్, వినోద్ ఉన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



కమ్మర్‌పల్లి: మండలంలో పోడు భూములకు పట్టాలు ఇవ్వడంతో శనివారం గిరిజనులు హర్షం వ్యక్తం చేస్తూ, సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ప్రకాష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై మొరం పనుల అడ్డగింత



రోడ్డు దుస్థితిని చూపుతున్న రైతులు

రెంజల్(బోధన్): రెంజల్ గ్రామం నుంచి ఎడపల్లి మండలం బ్రాహ్మణపల్లి గ్రామం వరకు గల బందల్ల రోడ్డుపై మొరం పనులను శనివారం సర్పంచ్ మర్ల రమేశ్‌తో పాటు బీఆర్‌ఎస్ నాయకులు భూమిపూజ చేసి ప్రారంభించారు. కానీ రోడ్డుపై మొరం వేస్తే వర్షాకాలంలో నడవలేని పరిస్థితిని ఎదుర్కోవాల్సి వస్తుందని రిలే దీక్షల్లో కూర్చున్న రైతులు అక్కడికి చేరుకుని అభ్యంతరం వ్యక్తం చేశారు. అవసరమైతే ముందుగా గుంతలు ఉన్న ప్రదేశాల్లో కంకర, దస్టు వేయాలని రైతులు, రైతు నాయకులు సూచించారు. లేదంటే ముందుగా డ్రైయినేజీ పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ నాయకులకు రోడ్డు పరిస్థితిని చూపించారు. దీంతో వారు పనులను విరమించుకున్నారు.

నాల్గో రోజుకు దీక్షలు..

రెంజల్‌లోని బందల్ల రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని కోరుతూ స్థానిక రైతులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం నాలుగో రోజు కొనసాగాయి. నాయకులు, అధికారులు పార్టీలకు అతీతంగా న్యాయం చేయాలని ఈసందర్భంగా రైతులు కోరారు. దీక్షలను కుల సంఘాల వారీగా చేపట్టాలని నిర్ణయించారు.

స్టోన్ క్రషర్‌పై బ్లాక్ మెయిల్ రాజకీయాలు



వేల్పూర్‌లో మాట్లాడుతున్న క్రషర్ నిర్వాహకులు

వేల్పూర్: ఏర్గట్ల మండలం బట్టాపూర్ జియోస్టోన్ క్రషర్‌పై బీజేపీ, కాంగ్రెస్ నాయకులు మల్లికార్జున్‌రెడ్డి, మానాల మోహన్‌రెడ్డి బ్లాక్ మెయిల్ రాజకీయాలకు పాల్పడుతున్నారని క్రషర్ నిర్వాహకులు వంశీ రెడ్డి, రూపేశ్‌రెడ్డి శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. వేల్పూర్‌లో శనివారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. స్టోన్ క్రషర్‌ను టీఎస్‌ఐపాస్ ద్వారా అన్ని రకాల అనుమతులతో ఏర్పాటు చేశామన్నారు. తాము మంత్రి ప్రశాంత్‌రెడ్డి బంధువులుగా ఉంటూ స్టోన్ క్రషర్ నడపడం తప్పా అని ప్రశ్నించారు. కోవిడ్ సమయంలో ప్లాంటుకు నష్టాలు వచ్చినా కరెంటు బిల్లు లక్షల్లో వచ్చిందన్నారు. దానిని విడతలుగా చెల్లిస్తున్నాము తప్ప, కట్టడం లేదన్నది అవాస్తవమన్నారు. తాము క్రషర్‌లో రూ. 400 కోట్లు ఆర్జించామని ఆరోపించారన్నారు. కావాలంటే త్రీస్టేజ్ అడ్వాన్స్ క్రషర్, 10 ఎకరాల పట్టాభూమిని కేవలం రూ. 10 కోట్లకే అన్ని రకాల సంతకాలు చేసి వారికి ఇచ్చేస్తామని పేర్కొన్నారు. తమ క్రషర్‌ను అడ్డం పెట్టుకొని మంత్రి ప్రశాంత్‌రెడ్డిపై కాంగ్రెస్, బీజేపీ నాయకులు బురదచల్లడమే పనిగా పెట్టుకొన్నారని, ఏదో ఒక ఫిర్యాదుతో వేధిస్తున్నారని ఆరోపించారు. మల్లికార్జున్‌రెడ్డి, మానాల మోహన్‌రెడ్డి పెడుతున్న ఇబ్బందులు తాము భరించలేమని, ఇక ఈ వ్యాపారం ఆపేస్తామని పేర్కొన్నారు.

ప్రశాంతంగా గ్రూప్-4 పరీక్షలు





ఆర్మూర్‌లో పరీక్ష కేంద్రం వద్ద అభ్యర్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు.. ఎడపల్లి మండల కేంద్రంలో..

ఆర్మూర్‌టౌన్/బోధన్/ఎడపల్లి: టీఎస్పీఎస్సీ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో నిర్వహించిన గ్రూప్-4 పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. పట్టణంలోని శ్రీచైతన్య, సెంటన్స్, శ్రీభాషిత, విజేత డిగ్రీ కళాశాల, క్షత్రీయ జూనియర్, ఇంజనీరింగ్ కళాశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల్లో అభ్యర్థులు సకాలంలో చేరుకున్నారు. పోలీసులు తనిఖీలు నిర్వహించి, అనంతరం లోనికి అనుమతి ఇచ్చారు. అలాగే ఎడపల్లి గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రం వద్ద అభ్యర్థులను పోలీసులు తనిఖీ చేసి, లోనికి అనుమతించారు. బోధన్ బస్టాండ్‌లో అభ్యర్థుల కోసం ఎమ్మెల్యే షకీల్ హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేశారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు సులభంగా చేరేందుకు నిర్వాహకులు సహకరించారు.

ఘనంగా గ్రామ దేవతల పండుగ



గ్రామ దేవతలకు పూజలు నిర్వహిస్తున్న గ్రామస్తులు



రుద్రూర్: మండల కేంద్రంలో శనివారం గ్రామ దేవతల పండుగ (ఊర పండగ)ను ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని వివిధ వార్డుల్లో కొలువై ఉన్న గ్రామ దేవతలకు కుల సంఘాల వారీగా పెద్దఎత్తున పూజలు చేశారు. ఎనిమిదేళ్ల తర్వాత ఊర పండుగ నిర్వహించినట్టు గ్రామపెద్దలు తెలిపారు.

'జన గర్జన'ను జయప్రదం చేయండి



కమ్మర్‌పల్లి: ఖమ్మంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించే తెలంగాణ జన గర్జన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి బాస వేణుగోపాల్‌యాదవ్ కోరారు. టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఆయన ఇటీవల నియమితులైన సందర్భంగా మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం ఆయనను పార్టీ కార్యకర్తలు, నాయకులు సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ జన గర్జన కార్యక్రమానికి ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ హాజరవుతున్నారన్నారు. నాయకులు రవి, తిప్పిరెడ్డి శ్రీనివాస్, నిమ్మ ప్రసాద్, బుచ్చిమల్లయ్య, దేవేందర్, గోపిడి లింగారెడ్డి, పడిగెల ప్రవీణ్, చింతకుంట శ్రీను పాల్గొన్నారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లీష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 – ఆదిపురుష్ (3డీ-తెలుగు) - 12.20, 9.45 ; లవ్ యూ రామ్ - 4.05
నారాయణ అండ్ కో - 6.45

స్క్రీన్-2 – ఎస్‌పీవై (తెలుగు) - 10.50, 1.45, 4.40, 07.35, 10.30

స్క్రీన్-3 – సత్యప్రేమ్‌కీ కథ (హిందీ) - 10.00, 4.10, 10.20
సామజవరగమన - 1.10, 7.20

స్క్రీన్-4 – ఈ నగరానికి ఏమైంది - 1.00
సామజవరగమన - 4.00
ఇండియానా జోన్స్ (తెలుగు) - 7.00
మాయపేటిక - 10.20

సంక్షిప్తం

ఎమ్మెల్యే జీవన్‌రెడ్డికి సన్మానం

ఆర్మూర్: లియాఫీ భవన నిర్మాణానికి నిధులివ్వాలని ఆర్మూర్ లియాఫీ సంఘ సభ్యులు శనివారం అంకాపూర్‌లో ఎమ్మెల్యే జీవన్‌రెడ్డిని కోరారు. ఎమ్మెల్యే స్పందించి అదనంగా మరో రూ.5లక్షలు మంజూరు చేస్తానన్ని ఎమ్మెల్యే అన్నారు. అనంతరం వానే ఎమ్మెల్యేను సన్మానించారు.


మాదిగ సంఘ భవన నిర్మాణానికి భూమిపూజ

బాల్కొండ: మండలంలోని బోదేపల్లి గ్రామంలో ఎస్సీ మాదిగ సంఘ భవన నిర్మాణానికి శనివారం వైస్ ఎంపీపీ శ్రీకాంత్, సర్పంచ్ నోముల రవి భూమిపూజ నిర్వహించారు. బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

రుద్రూర్: మోస్రా మండలం గోవూర్ హైస్కూల్‌లో విద్యార్థులకు శనివారం హెచ్‌ఎం రవీంద్రబాబు తన తండ్రి యలవర్తి జయరామారావు జ్ఞాపకార్థం ఫార్మేటివ్ పరీక్షల నోట్ బుక్కులను పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ సభ్యులు, విద్యా కమిటి సభ్యులు పాల్గొన్నారు.

ఎడపల్లి(బోధన్): మండలంలోని ఠానాకలాన్ జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు శనివారం పూర్వ విద్యార్థులు నోటు బుక్కులను పంపిణీ చేశారు. సర్పంచ్ భాస్కర్ రెడ్డి, ఎంపీటీసీ సుమలత పాల్గొన్నారు.



బాల్కొండ: మెండోరా మండలం బుస్సాపూర్ గ్రామానికి చెందిన గోపిడి శ్రీనివాస్‌రెడ్డి, ముప్కాల్‌మండల కేంద్రానికి చెందిన పాండురంగ బుక్‌స్టాల్ వారు శనివారం స్థానిక ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలను అందజేశారు. అనంతరం దాతలను ఉపాధ్యాయులు సన్మానించారు.

చిన్నారులకు పలకలు..

బోధన్‌రూరల్(బోధన్): మండలంలోని ఏరాజ్‌పల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం చిన్నారులకు మేము సైతం ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలకలను పంపిణీ చేశారు. అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి..

బాల్కొండ: బాల్కొండలో పోశవ్వ మందిరం వెనుక నిర్మిస్తున్న ఫంక్షన్‌హాల్ పనుల్లో ఒర్రెను పూడ్చకుండ చర్యలు తీసుకోవాలని కార్యదర్శి రజనీకాంత్‌కు శనివారం వీడీసీ సభ్యులు విన్నవించారు. వీడీసీ సభ్యులు తదితరులున్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు



ఆర్మూర్‌టౌన్: లయన్స్ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ నవనాథపురం నూతన కార్యవర్గం ఏర్పడిన సందర్భంగా శనివారం పట్టణంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కోర్టు ఆవరణలో డయాబెటిక్ శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు నోటు పుస్తకాలను అందజేశారు. క్లబ్ సభ్యులు న్యాయవాదులు పాల్గొన్నారు.